క్లుప్తంగా

8, 26 వార్డులలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలోని 8, 26 వార్డులలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 8వ వార్డు కొత్తపేట–2, 26వ వార్డు పాండురంగపేట సచివాలయాల వద్ద సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సచివాలయాలలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

దావులూరు(కొల్లిపర): దావులూరిపాలెం, దావులూరు పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలు గురువారం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎంపీడీవో వి.విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి అంబటి సంధ్యాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మిక నేత కామేశ్వరరావుకు నివాళి



తెనాలిటౌన్: విద్యుత్ కార్మికుల సమస్యల కోసం పోరాడిన కార్మిక సంఘం నాయకుడు ఎస్.ఎ.ఎస్.కామేశ్వరరావు ఉద్యోగుల గుండెల్లో చిరకాలం ఉంటారని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.వి.చిరంజీవి పేర్కొన్నారు. చెంచుపేటలోని డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయ ఆవరణలోని కామేశ్వరరావు విగ్రహం వద్ద వర్ధంతి గురువారం నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి ఈఈ చిరంజీవి, పలు యూనియన్‌లు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్.మోహనరావు, సిహెచ్.పురుషోత్తం, పరిశ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

3న బ్రాహ్మణ పరిషత్ వార్షిక వేడుకలు

తెనాలి: బ్రాహ్మణ పరిషత్, తెనాలి ఆధ్వర్యంలో డిసెంబరు 3న సంస్థ వార్షిక వేడుకలను నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రికను గురువారం పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక తాలూకా జూనియర్ కాలేజి ప్రాంగణంలో జరిగే వేడుకల్లో ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నోట్‌పుస్తకాల పంపిణీ, పరిషత్ సాయంతో క్యాంపస్ ప్లేస్‌మెంట్ సాధించిన యువతీయువకులకు సత్కారం ఉంటాయని తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త ఓరుగంటి నవీన్, దేవదాయ, ధర్మదాయశాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, ఏపీ టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు వరప్రసాద్, గుదిమెళ్ల లక్ష్మీనరసింహాచార్యులు వంటి ప్రముఖులు పాల్గొంటారని వివరించారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో పరిషత్ గౌరవాధ్యక్షుడు పెద్దిరాజు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు త్రిపురారిభట్ల దత్తు, చెన్నాప్రగడ శ్రీనివాస్, దావులూరి శ్యామ్‌సుందర్‌శర్మ, లక్కరాజు లక్ష్మణరావు, కావూరి సత్యనారాయణ, సీహెచ్ వెంకటగోపాలకృష్ణ, నందివెలుగు రామకృష్ణశర్మ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా

తెనాలిటౌన్: మున్సిపాలిటీ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. మురుగు కాల్వల్లో పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించాలని, పారిశుద్ధ్య కార్మికులను పెంచాలని, వార్డుల్లో శుభ్రత పాటించాలని వాటర్‌పైప్‌లైన్ లీకేజ్‌లు పరిష్కారం చేయాలని కోరుతూ కమిషనర్ జశ్వంతరావుకు బి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మంచాల రత్నరాజు, నాయకులు గాజుల వెంకయ్య నాయుడు, చుండూరు ఉమామహేశ్వరరావు, ప్రశాంతి, మద్దెల కృష్ణకాంత్, టి.అనంతాచార్యులు, అడపా సంపత్‌రాయుడు, విజయ భాస్కరరెడ్డి, శిఖా రవీంద్ర, బిట్రా కనకదుర్గ, సింగంరాజు కనకదుర్గ, గానకళావతి, గోపి, ఫణి, చంద్ర, రాఘవ, శ్రీనాథ్, గోపి పాల్గొన్నారు.

నేడు బేతపూడిలో కమ్యూనిటీ హాలు ప్రారంభం

మంగళగిరి: నగర పరిధిలోని బేతపూడిలో రూ 1.50 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేసుకుని సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. వేదికతో పాటు విశ్రాంత రూమ్‌లు, చుట్టూ ప్రహరీ, పచ్చదనంతో పరచుకున్న మొక్కలతో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ , ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) హాజరై ప్రారంభించనున్నారు. ఇళ్లలో చిన్న శుభ కార్యం చేసుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నామని, కమ్యూనిటీ హాల్ నిర్మించి తమ కలను ఎమ్మెల్యే ఆర్కే నిజం చేశారని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక
- 6,25 వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



25వ వార్డులో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 25వ వార్డు పినపాడు–2 సచివాలయం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందించినట్లు పేర్కొన్నారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అందించినట్లు వివరించారు. కమిషనర్ ఎం.జశ్వంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థిక చేయూతను ఇచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ తెనాలి క్లస్టర్ అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. 25వ వార్డులో ఇప్పటి వరకు రూ.20.56 కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను, జగన్ ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను చైర్‌పర్సన్ ఆవిష్కరించారు. సమావేశంలో మేనేజర్ అప్పలరాజు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

+ 6వ వార్డు గాంధీనగ్–2 సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించారు. 6వ వార్డులో ఇప్పటి వరకు రూ.20.26 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను, జగన్ ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ లావణ్య, వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, వైఎస్సార్ సీపీ నాయకులు నీలి అజయ్, పోతిరెడ్డి హేమలత, పోతిరెడ్డి నాగరాజు, డీఈ నాగభూషణం పాల్గొన్నారు.



దావులూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పద్మావతి , పోతిరెడ్డి



కొలకలూరులో సంక్షేమ పథకాల పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

భావితరాల భవిష్యత్‌కు భరోసా

దావులూరు(కొల్లిపర): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బావి తరాల బంగారు భవిష్యత్‌కు భరోసా ఇస్తూ పాలన సాగిస్తున్నారని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి అన్నారు. గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా పల్లెకు పోదాం కార్యక్రమం గురువారం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. సచివాలయంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. మండల కన్వీనర్ పోతిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి జగనన్న పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే బుక్‌లెట్స్, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి అంబటి సంధ్యాదేవి, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి బోసుబాబు, అద్దంకి వేణుగోపాల్‌గౌడ్, ఈఓపీఆర్డీ పూర్ణశంకరరావు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ వి.చంద్రమోహన్, సీనియర్ అసిస్టెంట్ మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

కొలకలూరులో 'పల్లెకు పోదాం' కార్యక్రమం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని సచివాయం–1 పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పథకాల బోర్డును ఎంపీపీ డి.చెన్నకేశవులు ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాల పత్రాలను పంపిణీ చేశారు. సచివాలయంలో జరిగిన సభకు మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సభలో ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయం–1 పరిధిలో రూ.53 కోట్లు సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సంక్షేమ అభివృద్ధి లక్ష్యంగా భావించి ముఖ్యమంత్రి పరిపాలన చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, డీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.ప్రతాప్‌రెడ్డి, ఈఓపీఆర్డీ జి.సుభాష్‌చంద్రబోస్, పంచాయతీ కార్యదర్శి సూరపనేని కల్పన, పీఆర్ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, వీఏఏ నాగరాజు, సీసీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పి.అనిల్‌కుమార్, ఆర్.రవిబాబు, టి.లక్ష్మీ కోటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, ఎ.రోశయ్య పాల్గొన్నారు.

జగనన్న కాలనీ లే అవుట్లలో సీసీ రోడ్ల నిర్మాణం



రోడ్లనిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: జగనన్న కాలనీ లే అవుట్లలో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. నేలపాడు వద్ద ఉన్న జగనన్న కాలనీ లే అవుట్‌లో నిర్మించిన అంతర్గత రోడ్లను గురువారం పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన రోడ్ల నాణ్యతను, నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఇంతకు పూర్వం ఇక్కడి రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు మెటీరియల్ తరలించుకునేందుకు తీవ్ర అవరోధంగా మారాయి. దీనితో ఎమ్మెల్యే శివకుమార్ ఈ సమస్యను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయేలా చూశారు. దీంతో నియోజకవర్గంలోని ఐదు లే అవుట్లలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతోంది. ఇళ్ల నిర్మాణానికి ఆటంకం తొలగిపోయిందని చెప్పారు. వీరితో మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, మున్సిపల్ ఇంజినీరు కె.నాగమల్లేశ్వరరావు, డీఈఈ నాగభూషణం, పార్టీ నాయకులు టి.రమేష్, కౌన్సిలరు పేరం సంజీవరెడ్డి ఉన్నారు.

చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు

పలువురు చేనేత కార్మికులకు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తన కార్యాలయంలో గుర్తుంపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.క్రాంతికుమార్, జి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజికి జాతీయ గుర్తింపు అభినందనీయం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



డాక్టర్ రామ్‌చంద్‌ను సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్, ఇతర ప్రముఖులు

తెనాలి: క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, క్యాంపస్ కొలువుల ఆశయంగా ఆవిర్భవించిన విద్యాసంస్థ వ్యవస్థాపకుడి ఆశయాన్ని నెరవేరుస్తూ జాతీయ స్థాయి గుర్తింపును పొందటం గొప్ప విషయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ఏఐసీటీఈ, ఎడ్యు స్కిల్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇటీవల గోవాలో నిర్వహించిన జాతీయస్థాయి స్కిల్ కనెక్ట్ యాన్యువల్ మీట్‌లో వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లో డిగ్రీ కాలేజి కేటగిరీలో ఫస్ట్‌ర్యాంక్, అన్ని విద్యాసంస్థల కేటగిరీలో జాతీయస్థాయి 34వ ర్యాంక్, సౌత్ ఇండియాలో బెస్ట్ పెర్ఫార్మెన్స్ డిగ్రీ కాలేజీగా ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజికి అవార్డులు లభించటం, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైన సందర్భంగా గురువారం కాలేజి కాన్ఫరెన్స్ హాలులో అభినందన సభ నిర్వహించారు. ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, వ్యవస్థాపకుడి ఆశయం, చైర్మన్‌గా తన ఆలోచనలు, మారుతున్న సమాజానికి అనుగుణంగా టెక్నాలజీని విద్యార్థులకు అందిస్తూ జాతీయస్థాయి గుర్తింపును సాధించిన క్రెడిట్ అంతా కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్‌కు, ఆయన అధ్యాపక బృందానికి దక్కుతుందన్నారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ కరోనా లాక్‌డౌన్‌లో ప్రత్యామ్నాయంగా వర్చువల్ ప్లాట్‌ఫాంకు వెళ్లాల్సి వచ్చిందని, వివిధ కంపెనీలతో ఎంవోయూలను కుదుర్చుకుని విద్యార్థులతో వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు చేయించిన ఫలితంగానే జాతీయస్థాయి అవార్డులు దక్కాయన్నారు. నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి మాట్లాడారు. కార్యక్రమంలో ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, పావులూరి ట్రస్ట్ చైర్మన్ పావులూరి శ్రీనివాసరావు, శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద, విశ్రాంత ప్రిన్సిపాల్స్ కొడాలి రాధాకృష్ణమూర్తి, డాక్టర్ జి.నాగేశ్వరరావు, ఫార్మసీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, మానవత కార్యదర్శి తన్నీరు శ్రీనివాస బాబు పాల్గొన్నారు.

'బాబూజి' రెండో షెడ్యూలు ఆరంభం



పాత్రధారులపై క్లాప్‌నిస్తున్న గెద్దేటి సురేంద్ర, పక్కన దర్శకుడు దిలీప్‌రాజా

తెనాలి: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ బయోపిక్ బాబూజి సినిమా రెండో షెడ్యూలు గురువారం ప్రారంభమైంది. చెంచుపేటలోని రత్న ఫార్చ్యూన్ కల్యాణమండపం ఆవరణలో రెండో షెడ్యూలు చిత్రీకరణను వైఎస్సార్ సీపీ నేత గెద్దేటి సురేంద్ర క్లాప్ నిచ్చారు. పట్టణానికి చెందిన వైద్యురాలు డాక్టర్ యశోధర పువ్వాడ కెమెరా స్విచాన్ చేశారు. లాల్‌బహదూర్ శాస్త్రితో జగ్జీవన్‌రామ్ మాట్లాడుతున్న సన్నివేశాన్ని తొలి షాట్‌గా దర్శకుడు దిలీప్‌రాజా చిత్రీకరించారు. జగజ్జీవన్‌రామ్‌గా మిలటరీ ప్రసాద్, లాల్‌బహదూర్ శాస్త్రిగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన అమీర్‌చౌదరి, గాంధీజీగా కేఆర్‌డీ శెట్టి, గాంధీ అనుచరులుగా మను, ఆబాగా పూజా కటారి, సుశీల జొన్నలగడ్డ, దళిత నాయకుడిగా చదలవాడ హరిబాబు నటించారు. జగజ్జీవన్‌రామ్ రెండుసార్లు జైలుకు వెళ్లిన సన్నివేశాలను తెనాలిలో, సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్, గాంధీజీ పాత్రలున్న సన్నివేశాలను హైదరాబాద్‌లో తీస్తామని దిలీప్‌రాజా వెల్లడించారు. కెమెరా వంశీ, సహాయ దర్శకత్వం ధనుష్, ఈశ్వర్, మేకప్ వెంకటేశ్వర్, సురేష్‌నాయక్. ప్రొడక్షన్ కంట్రోలర్ అయినంపూడి రాజేష్, నిర్మాత ఆలూరి సుందరరామయ్య, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే దిలీప్‌రాజా.

కోటి దీపాల అలంకరణ



పట్టణ ఐతానగర్‌లోని సాయిబాబా గుడిలో కార్తిక గురువారం సందర్భంగా శివలింగ ఆకారానికి కోటి దీపాలతో భక్తులు అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. -తెనాలి టౌన్

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కొల్లిపర: బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో శనివారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతవరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్న దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ కె.వెంకటరావు సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 6 వరకు జిల్లాలో ఒక మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. కావున మండలంలోని రైతులు వారి పంట పొలంలో ఉన్న వరి రాసులు వెంటనే ఇంటి వద్దకు, గూడంలోకి చేర్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వరి పంట కోత కోయని వారు వెంటనే హార్వెస్టర్ యంత్రాలు ద్వారా నూర్పిలు చేసుకోవాలన్నారు. పంట బయటకు రాలేని పరిస్థితులు ఉంటే దగ్గరలో ఉన్న మెరక ప్రదేశాలు చూసుకొని గింజలను తడవకుండా పట్టాలు కప్పి ఉంచుకోవాలని సూచించారు.

మున్సిపల్ ఉద్యోగులు సమష్టిగా పనిచేయాలి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



తెనాలిఅర్బన్: ఉద్యోగులందరూ సమష్టిగా పనిచేస్తూ తెనాలికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. ఆంధ్రా ప్యారిస్ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చినరావూరులోని సత్యనారాయణపార్కులో గురువారం కార్తిక వన సమారాధనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఒకే వేదికపై ఇలా కలుసుకోవడం మంచి పరిణామమన్నారు. ఎంతో ఒత్తిడితో జీవించే ఉద్యోగులకు ఇలాంటి కార్యక్రమాలు ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. ముందుగా ఆవరణలోని ఉసిరి, తులసీ చెట్లకు పూజలు చేశారు. అలాగే మహిళ ఉద్యోగులు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం.జశ్వంతరావు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడి మృతి

మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలో అనుమతులు లేకుండా నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కిందపడి గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు నాగేశ్వరరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సచివాలయం ఎదరుగా అనుమతుల్లేకుండా భవన నిర్మాణం జరుగుతున్నా సచివాలయ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో కార్పొరేషన్ అధికారులు దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు.

పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యం





సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు, (ఇన్‌సెట్) సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ రాధిక

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక
- ప్రశాంతంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

తెనాలిఅర్బన్: పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని గురువారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ అధ్యక్షత వహించారు. అజెండాలోని 11వ అంశం చదవటం పూర్తి కాగానే టీడీపీ కౌన్సిలర్లు అన్నం పిన్నారావు, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు లేచి పట్టణంలోని అనేక వార్డులలో రక్షిత తాగునీటి కుళాయిలు రోడ్లపై ఉన్నాయని, వాటిని వార్డు ప్రజలు ఉపయోగించుకోకపోయిన పన్నులు వేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వాటికి ఎందుకు పన్నులు వేశారని అధికారులను ప్రశ్నించారు. స్పందించిన ఎంఈ నాగమల్లేశ్వరరావు కుళాయి కనెక్షన్‌లు లేకుండా పొరపాటున పన్నులు వేసిన వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అమృత పథకం కింద కొన్ని ప్రాంతాల్లో కుళాయి కనెక్షన్‌లు ఏర్పాటు చేయించటం జరిగిందని, కొందరు వాటిని మాకు అవసరం లేదని పైప్‌లను బయట పడవేసినట్లు వివరించారు. పట్టణంలోని అనేక వార్డులో కనెక్షన్‌లు లేకుండా పన్నులు వేసిన వారి వివరాలు సచివాలయ సిబ్బందితో సేకరించి వాటిని రద్దు చేసినట్లు చెప్పారు. ఇంకా అలాంటివి ఉంటే మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని, నీరు రాని కుళాయిలు ఉంటే పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. తన వార్డులో చెత్త సేకరణ సరిగా జరగటం లేదని, కనీసం ఆటోలు కూడా రావటం లేదని టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం నిధులు ఇచ్చిన సదరు కాంట్రాక్టర్ ఆటో డ్రైవర్‌లకు వేతనం చెల్లించటంలో జాప్యం చేయటం వలన వారు విధులు బహిష్కరించారని శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావులూరి శ్రీనివాసరావు వివరించారు. డ్రైవర్‌లకు సదరు సంస్థ వేతరాలు చెల్లించిందని ప్రస్తుతం ఆటోలు వార్డులో చెత్తసేకరణ జరుపుతున్నట్లు చెప్పారు. మీ వార్డులో కూడా చెత్తసేకరణ జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కుర్రా సుజాత తన వార్డులో నిలచిపోయిన అభివృద్ధి పనులపై అధికారులను నిలదీశారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలు చదివి ఆమోదించినట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించారు. తొలుత చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన రాధికను టీడీపీ కౌన్సిలర్లు సన్మానించారు. సమావేశంలో కమిషనర్ ఎం జశ్వంతరావు, వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి పాల్గొన్నారు.

మానవ సేవ గొప్ప వరం

తాడేపల్లి రూరల్: నులకపేట చైతన్య తపోవన్‌లో ఏకల్ అభియాన్ విజయవాడ బాగ్ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు చదువు, సేవ, సంస్కారంపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. చైతన్య తపోవన్ మాత శివానంద సరస్వతి మాట్లాడుతూ సేవ చేయడం గొప్ప వరమని అన్నారు. ప్రతి ఒక్కరూ క్షమ కలిగి ఉండడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాగ్ అధ్యక్షులు రామనాథం వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్, సెక్రటరీ శంకరరావు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్వహణ భేష్ !

మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్వహణ అభినందనీయమని కేంద్ర బృందం ప్రశంసించింది. నగర పరిధిలోని యర్రబాలెం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ పరిశీలన బృందం సందర్శించింది. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన(పీఎంవీవీవై) పథక అమలును పరిశీలించారు. హెల్త్ సెంటర్‌లోని పలు విభాగాల్ని పరిశీలించి రోగులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు పీఎంవీవీవై పథకం సొమ్ము జమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురికి ప్రత్యక్షంగా ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రతినిధులు ఈశ్వర్ దత్, సుమిత్ కుమార్, డాక్టర్ చిత్ర, కోకిల, రాష్ట్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా అధికారులు, యర్రబాలెం హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ బృందం పరిశీలించింది. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం అమలు తీరుపై పలువురు గర్భిణులతో చర్చించారు. అనంతరం పీఎంఎంవీవై ఎస్ఓ డాక్టర్ ఈశ్వర్ మాట్లాడారు.

మహాకవి గురజాడకు ఘన నివాళి



ప్రసంగిస్తున్న రచయిత్రి కావూరి సత్యవతి

తాడేపల్లి రూరల్: మహాకవి గురజాడ వర్ధంతిని గురువారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రచయిత్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని కావూరి సత్యవతి పాల్గొన్నారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో గురజాడ ఒకరని తెలిపారు. సమాజంలో పాతుకుపోయిన మూఢాచారాల్ని పారదోలడానికి ఆయన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు.అందుకు కన్యాశుల్కం నాటకం, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ గేయాలు ఉదాహరణగా నిలుస్తాయని తెలిపారు. విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర బాధ్యుడు పి. మురళీకృష్ణ మాట్లాడుతూ తాడేపల్లి మహిళ కుట్టు శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో రెండు బ్యాచ్‌లు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళా సాధికారత కోసం ఎంబ్రాయిడరీ శిక్షణ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లి మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, ఎంబీవీకే బాధ్యులు పి. విజయ, తాడేపల్లి విజ్ఞాన కేంద్రం బాధ్యులు గాదె సుబ్బారెడ్డి, అరవింద హైస్కూల్ ప్రిన్సిపాల్ బి. ఇంద్రాణి, ప్రధానోపాధ్యాయులు రవిశంకర్, అరవింద, ఉపాధ్యాయులు హనుమంతరావు పాల్గొన్నారు.

వైభవంగా శివ కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవంలో శివపార్వతులు

మంగళగిరి: స్థానిక శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం (శివాలయం) 53వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అత్యంత వైభవంగా శివ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శివుడు జన్మ నక్షత్రం ఆరుద్ర నాడు ఏటా కల్యాణాన్ని అర్చకులు తెలకదేవరపల్లి శ్యాంసుందరశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. కార్యక్రమాన్ని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక, మురళి దంపతులతో పాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ పర్యవేక్షించారు.